

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 313 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 15, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# న్యాయస్థానాలు.. నిజాయితీని పాటించాలి!



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

అక్రమాలను నియంత్రిస్తేనే నిజమేంటో బయటపడుతుంది
తప్పులను సర్దుబాటు చేయకుంటే సమాజం నాశనం అవుతుంది
న్యాయస్థానాల్లో నిజాయితీ కన్నా అక్రమ కేసులే పెరిగిపోతున్నాయి
నిజాయితీతో సంబంధం లేకుండా బోలెడు కేసులు నడుస్తున్నాయి
జడ్జిల తీరు పట్ల తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి
క్రిమినల్ లాయర్లకు అనుకూలంగా కేసులు నడుస్తున్నాయంటూ విమర్శలు
తప్పు ఒప్పులతో సంబంధం లేదు న్యాయస్థానాల్లో అక్రమార్కుదే హవాలి
సామాన్యులను వేధించడం కోసం అక్రమంగా కేసులు వేయిస్తున్నారు
న్యాయస్థానాలే న్యాయం తప్పితే ప్రజాస్వామ్య పరిస్థితి ఏంది
గాడి తప్పుతున్న న్యాయ వ్యవస్థను కాపాడేది ఎవరు
డాక్టర్ బరిగెల శివ






న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడటంతో పాటు న్యాయస్థానాల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెంపొందించాలని డా. బరిగెల శివ అభిప్రాయపడ్డారు. న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే సామాన్యులు సంవత్సరాల తరబడి కేసుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వ్యాపార లావాదేవీలు, భూవివాదాలు, కుటుంబ కలహాలు తదితర కేసుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొందరు న్యాయ వాదులు, ఇతర వ్యక్తులు న్యాయప్రక్రియను దుర్వి నియోగం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని, తప్పు చేసినట్లు రుజువైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. తెలంగాణలో సుమారు 13 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న గణాంకాన్ని ప్రస్తావిస్తూ, కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సహా వివిధ న్యాయస్థానాల్లో కీలక కేసుల విచారణ, తీర్పుల విషయంలో పారదర్శకత ఉండాలని, అన్ని కేసుల్లో చట్టం, రాజ్యాంగ సూత్రాలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగానే నిర్ణయాలు వెలువడాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ, ప్రభుత్వ వ్యవస్థల పనితీరు వంటి ప్రజాప్రాధాన్య అంశాలపై దాఖలయ్యే పిటిషన్లను కూడా చట్టప్రకారం విచారించాలని కోరారు. న్యాయమూర్తులపై లేదా న్యాయవాదులపై వచ్చే ఆరోపణలను ఆధారాలతో పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటం, న్యాయప్రక్రియ దుర్వినియోగాన్ని అరికట్టడం, సామాన్యులకు సకాలంలో న్యాయం అందించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమని డా. బరిగెల శివ స్పష్టం చేశారు. - హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

2

## విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ ఆగ్రహం

అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి
విద్యుత్ ఉత్పత్తి పెంచాలని ఆదేశం
నైనీ, మహానది బొగ్గు లింకేజీలపై ప్రశ్నలు
రైతులకు ఇబ్బందులు కలిగితే చర్యలు తప్పవని హెచ్చరిక
స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీకి సస్పెన్షన్ హెచ్చరిక

2



## కీర్తి నగర్ రోడ్డు వివాదంపై అధికారుల కౌంటర్!

రూ.12 లక్షల పనుల్లో రూ.10 లక్షలు తీసుకున్నారనే ఆరోపణలకు ఆధారాలేవి?
పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించండి
సోషల్ మీడియా ప్రచారాన్ని గుడ్డిగా నమ్మొద్దు
డీఈ, ఏఈ వివరణ

2




## 'నో' అని రిప్లై ఇస్తే ఖాతా ఖాళీ!

ఓటీపీ, లింక్ లేకుండానే మోసమంటూ ప్రచారం
వాట్సాప్ సందేశాలతో సైబర్ నేరగాళ్ల కొత్త పన్నాగం
నకిలీ బ్యాంకు సందేశాలతో ప్రజల్లో ఆందోళన
అనుమానాస్పద సందేశాలకు స్పందించొద్దని సూచన
మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలి

8



## యువత, మహిళలకు పారిశ్రామిక రంగంలో సమాన అవకాశాలు

తెలంగాణను అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
యువత స్టార్టప్‌లు, కొత్త పరిశ్రమలు స్థాపించాలి
2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ
మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక
మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

8



## రాజకీయ అండతో రెచ్చిపోతున్న ఎమ్మార్వో?

"పేపర్లలో ఎన్ని రాసినా నన్నేం చేయలేరు" అన్న ధీమా వెనుక ఎవరున్నారు?
ఎమ్మార్వో కార్యాలయం.. వ్యాపారాలకు అడ్డా?
రెవెన్యూ ఉన్నత అధికారులకు పట్టింపు లేదా.....కావాలనేచేస్తున్నారా....
సామాన్య ప్రజలు, రైతుల ఆవేదన
కార్యాలయంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, రైతుల డిమాండ్
ప్రశ్నిస్తే అణచివేతేనా?
ఆస్తులపై సమగ్ర విచారణ అవసరమా?
హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయంపై వరుస ఆరోపణలు..
భూ వ్యవహారాలు, ఫైళ్లు, ఆస్తులపై సమగ్ర విచారణకు డిమాండ్
ఎమ్మార్వోపై సమగ్ర విచారణకు అడ్డుపడుతున్న ఉన్నతాధికారులు.
ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ స్పందించాలని డిమాండ్

3



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ ఆగ్రహం

అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి
విద్యుత్ ఉత్పత్తి పెంచాలని ఆదేశం
నైనీ, మహానది బొగ్గు లింకేజీలపై ప్రశ్నలు
రైతులకు ఇబ్బందులు కలిగితే చర్యలు తప్పవని హెచ్చరిక
స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీకి సస్పెన్షన్ హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబర్ 14(జై భీమ్ డెస్క్) :**



రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యుత్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా పలుమార్లు ఆదేశించినప్పటికీ పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని ప్రశ్నించినట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని ఎందుకు పెంచడం లేదని నిలదీసినట్లు సమాచారం. నైనీ, మహానది నుంచి బొగ్గు లింకేజీ ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సామర్థ్యానికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత తనపై ఉందని, ముఖ్యంగా పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఇప్పటికే పలుమార్లు ఆదేశించినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. విద్యుత్ అంతరాయాల వల్ల ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. అవసరమైతే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్‌కో సీఎండీ స్థాయి అధికారులపైనా సస్పెన్షన్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా అంతరాయాలకు గల కారణాలను వెంటనే వెల్లడించాలని, విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు లభ్యత, విద్యుత్ ప్లాంట్ల పనితీరు, సరఫరా వ్యవస్థలోని సమస్యలపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

# జీడబ్ల్యూఎంసీలో బతుకమ్మ సంబరాలకు ఘనంగా ఏర్పాట్లు!

మహిళా ఉద్యోగులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలి : కమిషనర్ టి. వెంకన్న

**జీడబ్ల్యూఎంసీ, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కమిషనర్ టి. వెంకన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు సంబంధించి విద్యుత్ దీపాలంకరణ, సౌండ్ సిస్టమ్, పారిశుధ్యం, ఫాగింగ్, తాగునీటి సరఫరా, బతుకమ్మల తయారీ, మహిళా సంఘాల సమీకరణ, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు తదితర ఏర్పాట్ల కోసం అధికారులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమకు అప్పగించిన విధులను సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు.జీడబ్ల్యూఎంసీలో పనిచేస్తున్న అన్ని విభాగాల మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు, నగరంలోని మహిళలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మలతో పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కమిషనర్ టి. వెంకన్న పిలుపునిచ్చారు. సంప్రదాయ ఆటపాటలతో వేడుకల్లో పాల్గొని బతుకమ్మ సంబరాలకు మరింత శోభ తీసుకురావాలని కోరారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. అందరి భాగస్వామ్యంతో వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి, వరంగల్ నగర సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటాలని ఆయన ఆకాంక్షించారు.

# ఒడిశాలో రెండు తలలతో మగ శిశువుల జననం

అత్యంత అరుదైన జన్మస్థితి?.. వైద్యుల పర్యవేక్షణలో శిశువులు

**ఒడిశా,14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



ఒడిశాలో అత్యంత అరుదైన జన్మస్థితితో మగ శిశువులు జన్మించారు. కంధమాల్ జిల్లాకు చెందిన ఓ మహిళకు అక్టోబర్ 10న సిజేరియన్ శస్త్రచికిత్స ద్వారా రెండు తలలతో శిశువులు జన్మించినట్లు సమాచారం. అనంతరం వారిని మెరుగైన వైద్య సంరక్షణ కోసం బెర్హాంపూర్‌లోని ఎంకేసీజీ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం శిశువులను ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో ఉంచి వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అయితే, శిశువుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వైద్యులు అందిస్తున్న చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.వైద్య పరిభాషలో ఈ అరుదైన జన్మస్థితిని 'డైసెఫాలస్ పారాపాగస్' అని పిలుస్తారు. ఇది కవల శిశువుల శరీరాలు కొంతవరకు కలిసిపోయి, రెండు తలలు ఉండే ఒక అరుదైన పరిస్థితి. అయితే, శిశువుల శరీర నిర్మాణం, అంతర్గత అవయవాల పరిస్థితి వంటి వివరాలను వైద్య పరీక్షల ద్వారానే నిర్ధారించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితులు చాలా అరుదుగా సంభవిస్తాయి. శిశువుల ఆరోగ్య పరిస్థితి, వారికి అవసరమైన వైద్య సంరక్షణపై ప్రస్తుతం వైద్యులు దృష్టి సారించారు. వారి ఆరోగ్యానికి సంబంధించిన మరిన్ని వివరాలు అధికారికంగా వెల్లడైతేనే పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# న్యాయస్థానాలు నిజాయితీని పాటించాలి

అక్రమాలను నియంత్రిస్తేనే నిజమేంటో బయటపడుతుంది
తప్పులను సర్దుబాటు చేయకుంటే సమాజం నాశనం అవుతుంది
న్యాయస్థానాల్లో నిజాయితీ కన్నా అక్రమ కేసులే పెరిగిపోతున్నాయి
నిజాయితీతో సంబంధం లేకుండా బోలెడు కేసులు నడుస్తున్నాయి
జడ్జిల తీరు పట్ల తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి
క్రిమినల్ లాయర్లకు అనుకూలంగా కేసులు నడుస్తున్నాయంటూ విమర్శలు
తప్పు ఒప్పులతో సంబంధం లేదు న్యాయస్థానాల్లో అక్రమార్కుదే హవాలి
సామాన్యులను వేధించడం కోసం అక్రమంగా కేసులు వేయిస్తున్నారు
న్యాయస్థానాలే న్యాయం తప్పితే ప్రజాస్వామ్య పరిస్థితి ఏంది
గాడి తప్పుతున్న న్యాయ వ్యవస్థను కాపాడేది ఎవరు
డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

న్యాయస్థానాల్లో నిజాయితీ కొరవడితే సామాన్యుల పరిస్థితి అదోగతేనంటూ డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.ప్రభుత్వ వ్యవస్థలు ఒక్కొక్కటిగా ప్రభుత్వాలకు తలొగ్గి పనిచేస్తున్న సందర్భంలో చివరకు న్యాయ వ్యవస్థ కూడా ప్రభుత్వాలకు మద్దతుగా నిలిచి ప్రభుత్వాల అక్రమాలను పెంచి పోషించడం కోసం ప్రత్యేకమైన శ్రద్ధ చూపిస్తూ ఉండడాన్ని న్యాయస్థానాలు ప్రజల పట్ల పక్షపాతాన్ని చూపిస్తున్నాయని ప్రశ్నించారు.దేశంలో ఏ రాష్ట్రంలో చూసిన న్యాయస్థానాలన్నీ వ్యాపారస్తుల కేసులతో భూకబ్జాదారుల కేసులతో కుటుంబ కలహాల కేసులతో కిక్కిరిసిపోతున్నాయని గుర్తు చేస్తూనే కుటుంబ కలహాలకు సంబంధించిన కేసులు కాలానుకూలంగా పరిష్కార మార్గాలను కనపరుస్తున్నప్పటికీ వ్యాపారస్తుల కేసులు భూకబ్జాదారుల కేసులు న్యాయస్థానాలను పూర్తిస్థాయిలో తప్పుదోవ పట్టిస్తూ న్యాయస్థానాల్లో జరగాల్సిన న్యాయాన్ని శాసిస్తున్నాయని దానికి అంతటికి ప్రధాన కారణం న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న క్రిమినల్ న్యాయవాదులు సీనియర్ న్యాయదులు కేసులను తప్పుకోవ పట్టిస్తూ జడ్జీలను తప్పుదోవ పట్టిస్తూ ఆధారాలను తారుమారు చేస్తూ ప్రజాస్వామ్య విలువలను న్యాయస్థానం రాజ్యాంగ విలువలను పూర్తిగా కాలరాస్తూ తప్పును ఒప్పు చేయడానికి ఒప్పును తప్పు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని నల్ల కోర్ట్ ముసుగులో న్యాయస్థానాలను శాసిస్తూ వ్యాపారస్తులు చెల్లించే డబ్బులకు భూకబ్జాదారులు చెల్లించే డబ్బులకు ఆశాపరులై న్యాయ వ్యవస్థకు మచ్చ తెస్తున్నారని అన్నారు.

**పరుపతి పైస సంపాదనకే ప్రాధాన్యం..**



తెలంగాణలోని న్యాయస్థానాల గణాంకాలను బట్టి సుమారుగా 13 లక్షల కోర్ట్ కేసులు పెండింగ్లో ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ ఎక్కువ శాతం కేసులు తప్పుడు పద్ధతిలో నమోదు చేయబడి న్యాయస్థానాల చుట్టూ సామాన్యులను తిప్పుకుంటూ వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.నల్ల కోర్ట్ వేసుకున్న కొంతమంది న్యాయవాదులు వాళ్ల సామాజిక వర్గాలకు చెందిన న్యాయమూర్తుల అండను అడ్డం పెట్టుకొని కేసుల విషయాల్లో సామాన్యులను వేధిస్తూ సంవత్సరాల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిప్పే విధంగా పలువిధాల వేధింపులకు పాల్పడుతూ భూకబ్జాదారులు అక్రమంగా సంపాదించిన పైసలకు కక్కుర్తి పడుతూ వేధింపులతో రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి న్యాయస్థానాలలో చూసిన భూకబ్జాదారుల కోసం క్రిమినల్ న్యాయవాదులు పోలీస్ స్టేషన్లో సంబంధం లేకుండా పోలీసు వ్యవస్థకు సంబంధం లేకుండా న్యాయస్థానాల్లోనే అక్రమ కేసులు కట్టిస్తూ సామాన్యుల ఉసురు పోసుకుంటున్నారని అన్నారు.భూకబ్జా రౌడీషీటర్లకు సైతం ప్రొటెస్ట్ పిటీషన్స్ వేయిస్తూ గొప్ప ఘనకార్యాలకు పాల్పడుతున్న క్రిమినల్ న్యాయవాదుల ఆస్తులను అక్రమాలను సమాజం ముందుకు తీసుకురావాలని తెలిపారు.కొంతమందైతే మరి అధ్వానంగా న్యాయవాద వ్యవస్థకే మచ్చుతునకగా మారి న్యాయవ్యవస్థను న్యాయస్థానాలను ధన సంపాదన కోసం వాడుకుంటూ న్యాయస్థానాలను అప్రతిష్టపాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**వీగిపోతున్న సుప్రీంకోర్టు కేసులు..**

కేంద్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వం మద్దతుదారుల తరఫున ఏలాంటి కేసులు సుప్రీం కోర్టు న్యాయస్థానాల్లో నమోదు చేయబడిన తక్కువ రోజుల వ్యవధిలో వాళ్లకు న్యాయం జరుగుతూ ఎంతటి అక్రమమైన కేసులైనప్పటికిని ఆధారాలు ఉన్న ఆధారాలు లేకున్నా న్యాయస్థానాన్ని నిందలపాలు చేసైనా అక్రమార్కులకు అవినీతిపరులకు ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేస్తున్న వ్యక్తులకు సహకారంగా నిలుస్తున్నారని దేశవ్యాప్తంగా విమర్శలు వస్తుండగా గత మూడు సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో వేయబడుతున్న కేసుల వివరాలు వాటి ఆధారాలు వాటి తొలి తీర్పులు పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లుగా దేశ ప్రజలు,మేధావులు, నిపుణులు, గమనిస్తున్నారన్నారు. కొంతమంది నిజాయితీ కలిగిన సీనియర్ న్యాయవాదులు పూర్తి ఆధారాలను కేసులకు జతపరుస్తూ, కేసులు వాదిస్తూ న్యాయం కోరుతున్నప్పటికిని ప్రధాన కేసులలో తీర్పులను నిజాయితీ వైపు కేటాయించాల్సింది పోగా అన్యాయం వైపు కేటాయిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు న్యాయస్థానాన్ని నిందలపాలు చేస్తున్నట్లు సీనియర్ న్యాయవాదులు బహిరంగంగా ప్రకటనలు చేస్తూనే న్యాయస్థానాల్లో న్యాయం జరగడం లేదంటూ వాదనలకు దిగుతున్నారని అన్నారు.అన్నిటికన్నా ముఖ్యంగా భారత ఎన్నికల కమిషన్ పై సర్ ప్రక్రియ విధానం పై సుప్రీంకోర్టులో వేయబడిన కేసులకు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు అనుమతించి విచారణలకు అవకాశాలు కల్పిస్తే దేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమాలు ఇంతలా తీవ్రతరాన్ని తెచ్చిపెట్టేవి కాదన్నారు.కేసుల వివరాలను పరిశీలించకుండా ప్రధాన కేసులకు సంబంధించిన వాదనలను పరిగణలోకి తీసుకోకుండా సునాయాసంగా తోసిపుచ్చుతు, సునాయాసంగా కొట్టివేస్తూ,న్యాయస్థానాలను అక్రమార్కులకు అండగా నిలిపేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారన్నది పలు కేసుల్లో వెలుగు చూసిన అంశాలు బట్టబయలు చేస్తున్నాయని అన్నారు.కొన్ని సందర్భాల్లో నైతే ప్రభుత్వానికి సంబంధించిన కేసులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ మిగతా పార్టీల కేసులను పట్టించుకోకుండా అలసత్వాన్ని ఆలస్యాన్ని ప్రదర్శిస్తూ తప్పుతోవ పట్టించడం ప్రస్తుత న్యాయస్థానాల్లో ఒక ట్రెండులా మారిపోయిందని విమర్శించారు.మతపరమైన కక్షలను రెచ్చగొట్టి, కులాల మధ్య చిచ్చు పెట్టాలని రాజకీయ దుర్బుద్ధిని బలపరిచిన మాత్రం ఆంధ్ర ప్రదేశ్ న్యాయస్థానం, ఆంధ్రప్రదేశ్ న్యాయస్థానం తీర్పును అమలు పరచాలని సుప్రీంకోర్టు ప్రకటించడం దేశంలో 76 సంవత్సరాల భారత రాజ్యాంగ విలువ పూర్తిస్తాయిలో నాశనం చేశారని గుర్తు చేశారు.దేశ రాజకీయాలు దేశంలోని ప్రభుత్వ వ్యవస్థలు ఇంతలా దరిద్రమైన స్థితిలోనికి రావడానికి ప్రధాన కారణం ఒకటి పోలీసు వ్యవస్థ మరొకటి న్యాయస్థానాలేనంటూ బహిరంగంగా గుర్తు చేశారు.నిజాయితీకి విలువను ఇవ్వలేని న్యాయస్థానాలు,ప్రజాస్వామ్య విలువలకు న్యాయం చేయలేని న్యాయస్థానాలు,భారత రాజ్యాంగ విలువలను చట్టాలకు అనుకూలంగా అమలుపరుచలేని న్యాయస్థానాలు,రానున్న కాలంలో దేశ పరిస్థితిలను ఇంకా హీనమైన స్థితిలోనికి నెట్టి వేయగలమంటూ వివరించారు.దేశంలో రేపిస్టులకు మత పిచ్చోళ్లకు, వ్యవస్థలను నాశనం చేస్తున్న అధికారులకు, ప్రభుత్వాల మద్దతుతో ఎంతో అవినీతికి పాల్పడుతున్న వ్యాపారస్తులకు,పేద ప్రజల పట్ల కనివిని ఎరుగని కక్షలను పెంచుతున్న రాజకీయ నాయకులను అలాంటి వాళ్ళను వెనుకేసుకోస్తున్న న్యాయస్థానాలు మారానంతకాలం దేశ ప్రజల పరిస్థితి అధోగతి పాలు కావాల్సిందేనంటే సూటిగా, స్పష్టంగా తెలియజేశారు.

# కీర్తి నగర్ రోడ్డు వివాదంపై అధికారుల కౌంటర్!

రూ.12 లక్షల పనుల్లో రూ.10 లక్షలు తీసుకున్నారనే ఆరోపణలకు ఆధారాలేవి?
పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించండి
సోషల్ మీడియా ప్రచారాన్ని గుడ్డిగా నమ్మొద్దు
డీఈ, ఏఈ వివరణ

**కీర్తి నగర్, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

గొర్రెకుంట కీర్తి నగర్ రోడ్డు నిర్మాణ పనులపై సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రోడ్డు పనులు పూర్తికాకుండానే బిల్లులు మంజూరు చేశారని, అధికారి--కాంట్రాక్టర్ కుమ్మక్కయ్యారని, ఈ వ్యవహారంలో రూ. 10 లక్షల లావాదేవీ జరిగిందని వస్తున్న ఆరోపణలను సంబంధిత డీఈ, ఏఈ ఖండించారు.వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరికాదని, ఆరోపణలు చేసేవారు వాటికి సంబంధించిన ఆధారాలు చూపాలని వారు సూచించారు.

**రూ. 12 లక్షల పనులకు రూ. 10 లక్షలు ఇస్తారా?**

రోడ్డు నిర్మాణ పనుల విలువ సుమారు రూ. 12 లక్షలుగా పేర్కొంటూ, రూ. 10 లక్షల లావాదేవీ జరిగిందనే ఆరోపణలు రావడంపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. రూ. 12 లక్షల పనులకు రూ. 10 లక్షలు ఇచ్చారనే ఆరోపణ వినడానికే ఆశ్చర్యంగా ఉందని వారు అభిప్రాయపడినట్లు తెలిసింది. అయితే, ఆరోపణలు నిజమా కాదా అనేది భావోద్వేగాలు లేదా ప్రచారం ఆధారంగా కాకుండా, నిర్ధారిత ఆధారాల ద్వారానే తేలాల్సి ఉంటుంది. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రశ్నించడం ప్రజల హక్కు. అదే సమయంలో, ఆధారాలు లేకుండా ఎవరినీ అవినీతిపరులుగా చిత్రీకరించడం సరికాదు. ఆరోపణలు చేస్తున్నవారు తమ వద్ద ఉన్న ఆధారాలను సంబంధిత అధికారులకు అందించాలి.




**పనుల నాణ్యతపై అనుమానాలుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించండి**

రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై ఎవరికైనా సందేహాలుంటే పనులు జరిగిన ప్రాంతానికి వచ్చి పరిశీలించాలని డీఈ, ఏఈ అన్నారు. కేవలం సోషల్ మీడియా పోస్టులను చూసి నిర్ణయానికి రావడం కంటే, క్షేత్రస్థాయిలో పనుల పరిస్థితిని పరిశీలించడం ముఖ్యమని వారి వివరణ సారాంశంగా ఉంది.అయితే, పనుల నాణ్యతను నిర్ధారించడానికి ప్రత్యక్ష పరిశీలనతో పాటు మంజూరైన అంచనా వ్యయం, పని ఉత్తర్వులు, మెజర్‌మెంట్ బుక్స్ (ఎంబీ బుక్స్), బిల్లుల చెల్లింపుల వివరాలను కూడా పరిశీలించాలి. నమోదైన కొలతలకు అనుగుణంగా పనులు జరిగాయా? పనుల పురోగతిని బట్టి బిల్లులు మంజూరయ్యాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**రికార్డుల పరిశీలనతోనే నిజానిజాలు వెలుగులోకి!**

అధికారి--కాంట్రాక్టర్ కుమ్మక్కయ్యారనే ఆరోపణలపైనా నిర్ధారిత ఆధారాల ఆధారంగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ఆరోపణలను ముందుగానే నిజమని భావించడం ఎంతవరకు సరికాదో, వాటిని ఆధారాలు పరిశీలించకుండానే కొట్టిపారేయడం కూడా అంతే సరికాదు.ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు పనుల రికార్డులు, బిల్లులు, కొలతల పుస్తకాలు, నిర్మాణ నాణ్యతను పరిశీలించి వాస్తవాలను వెల్లడిస్తే వివాదానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ఆరోపణలు చేస్తున్నవారు తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పిస్తే వాటిపై విచారణ జరిపేందుకు అవకాశం ఉంటుంది. కీర్తి నగర్ రోడ్డు వ్యవహారంలో ఆరోపణలు ఒకవైపు, వాటిని ఖండిస్తున్న అధికారుల వివరణ మరోవైపు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియా ప్రచారాన్ని మాత్రమే నమ్మకుండా, ఆధారాలు , అధికారిక రికార్డుల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించుకోవాలి. ప్రజాధనంతో చేపట్టిన పనులపై పారదర్శకత ఉండాలి. ఆరోపణలు చేసేవారు ఆధారాలు చూపాలి. సంబంధిత అధికారులు రికార్డుల ఆధారంగా స్పష్టత ఇవ్వాలి. - జై భీమ్ న్యూస్ అధికార ప్రతినిధి, హన్మకొండ శ్రీకాంత్

# రాజకీయ అండతో రెచ్చిపోతున్న ఎమ్మార్వో?

## "పేపర్లలో ఎన్ని రాసినా నన్నేం చేయలేరు" అన్న ధీమా వెనుక ఎవరున్నారు?






**ఎమ్మార్వో కార్యాలయం.. వ్యాపారాలకు అడ్డా?**
**రెవెన్యూ ఉన్నత అధికారులకు పట్టింపు లేదా.....కావాలనేచేస్తున్నారా....**
**సామాన్య ప్రజలు, రైతుల ఆవేదన**
**కార్యాలయంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు, రైతుల డిమాండ్**
**ప్రశ్నిస్తే అణచివేతేనా?**
**ఆస్తులపై సమగ్ర విచారణ అవసరమా?**
**హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయంపై వరుస ఆరోపణలు.. భూ వ్యవహారాలు, ఫైళ్లు, ఆస్తులపై సమగ్ర విచారణకు డిమాండ్**
**ఎమ్మార్వోపై సమగ్ర విచారణకు అడ్డుపడుతున్న ఉన్నతాధికారులు.**
**ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ స్పందించాలని డిమాండ్**

**హసన్‌పర్తి, అక్టోబర్ 14 (జై భీమ్ న్యూస్)**

అధికార దుర్వినియోగం వ్యవస్థను ఎంతగా నాశనం చేస్తుందో స్పష్టంగా తెలుసుకోవాలంటే హసన్పర్తి ఎమ్మార్వో కార్యాలయం ఉదాహరణగా తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు భవిస్తున్నారు. ఒకవైపు ఉన్నతాధికారుల అండ మరోవైపు రాజకీయ పలుకుబడి ఉంటే ఎన్ని అక్రమాలు చేసిన ఎవరు పట్టించుకోలేరనేది ప్రస్తుత దినాల్లో స్పష్టంగా తెలిసిపోతుంది. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాల్సిన ఎమ్మార్వో ప్రతీ నెల జీతభత్యాలు తీసుకుంటూ ప్రజాసేవకు విఘాతం కలిగిస్తూ సమాజం దృష్టిలో గొప్పవాడు అనిపించుకోవడం కోసం ఎంతో ప్రయాస పడుతున్నట్లు తన పైరవీల పరంపర స్పష్టంగా తెలియజేస్తుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన రెవెన్యూ కార్యాలయం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పనిచేయాల్సి ఉండగా, హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ వినిపిస్తున్న ఆరోపణలు ప్రస్తుతం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కార్యాలయంలో జరుగుతున్న కొన్ని వ్యవహారాలపైఅన్ని రకాల అక్రమాలపై,సామాన్య రైతులను వేధిస్తున్న విధానాలపై ప్రజలు, రైతులు, బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మార్వో కిరణ్ కుమార్ అధికార విధుల పట్ల"పేపర్లలో ఎన్ని రాసినా నన్నేం చేయలేరు.. నా స్టైలే వేరు.. నా పద్ధతే వేరు" అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా స్థానికంగా తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. కార్యాలయ వ్యవహారాలపై ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన అధికారి, ప్రశ్నించే వారిపైనే ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని అదే నేపథ్యంలో, ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? అనే అంశంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. తనపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా రాజకీయంగా, అధికారికంగా తనకు అండ ఉందనే ధీమాతో వ్యవహరిస్తున్నాడని పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండగా. వాటన్నింటినీ ఒక్క ఫోన్ కాల్‌తో చక్కదిద్దుకునే స్థాయిలో పలుకుబడి ఉందనే విషయాన్ని మండలంలోని ప్రజలు బలంగా నమ్ముతున్నారు. రాజకీయపరమైన పలుకుబడి ఉన్నందునే తనపై ఎలాంటి విచారణ జరగకుండా అధికారిక పైరవీలు కొనసాగిస్తూ తన విధులకు ఎలాంటి ఆటంకాలు కల్పించబడకుండా జాగ్రత్త పడుతున్నట్లు ప్రజలు రైతులు సిద్దస్థాయిలో చర్చించుకుంటున్నారు. కాబట్టి ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన బాధ్యత సంబంధిత ఉన్నతాధికారులపై ఉందని పలువురు అంటున్నారు. ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయం కొందరి వ్యక్తిగత ప్రయోజనాలకు కేంద్రంగా మారిందనే ఆరోపణలుపెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. భూములకు సంబంధించిన వ్యవహారాలు, ధ్రువపత్రాల జారీ, రెవెన్యూ రికార్డుల మార్పులు, మ్యుటేషన్లు, వారసత్వ బదలాయింపులు, ప్రభుత్వ భూములు, చెరువులు, శిఖం భూములు, అసైన్డ్ భూములు, సర్వే రికార్డులు తదితర అంశాల్లో నిబంధనలు పాటించకుండా ఇష్టారాజమైన వ్యవహార శైలిని అధికార రూపంలో ప్రదర్శిస్తున్నారు అంటూ పలువురు విమర్శిస్తున్నారు? ప్రతి దరఖాస్తు, ప్రతి ఫైల్, ప్రతి నిర్ణయం నిబంధనల ప్రకారమే జరిగిందా? ఎవరు దరఖాస్తు చేశారు? ఎవరు సిఫార్సు చేశారు? ఏ అధికారి పరిశీలించారు? ఫైల్‌లో ఏమి నోట్ చేశారు? చివరకు ఏ నిర్ణయం తీసుకున్నారు? అనే అంశాలను పరిశీలిస్తే అసలు వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలు, రెవెన్యూ శాఖ మార్గదర్శకాలను పక్కనపెట్టి వ్యక్తిగత నిర్ణయాలే కీలకంగా మారుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. "నేను ఏది చెబితే అదే వేదం" అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో ఇది తీవ్రమైన అంశంగా పరిగణించాల్సి ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగి తన వ్యక్తిగత నిర్ణయాల కంటే శాఖాపరమైన నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలు, చట్టపరమైన విధానాలకు లోబడి పనిచేయాల్సి ఉండటంతో, హసన్‌పర్తి కార్యాలయంలో గతంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలను సమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని సామాన్య ప్రజలు, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ సరైన స్పందన లభించడం లేదని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. భూ రికార్డుల్లో చిన్నపాటి తప్పు ఉన్నా రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, ఒక ఫైల్ కోసం పలుమార్లు కార్యాలయానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు చెబుతున్నారు. కొందరి పనులు మాత్రం వేగంగా పూర్తవుతున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. "ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండాలి.. అధికారులు ప్రజల సమస్యలను విని పరిష్కరించాలి.. సమస్యల పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయానికి రావాల్సిన పరిస్థితి ఉండకూడదు" అంటూ బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శకతపై ప్రశ్నలు అడగడం ప్రజల హక్కు. అయితే కార్యాలయ వ్యవహారాలపై ప్రశ్నించే వారిని బెదిరించడం, ఒత్తిడి చేయడం లేదా వారి ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వంటి ఆరోపణలు నిజమైతే వాటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటిపై విచారణ జరిపి, నిజానిజాలను వెల్లడించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని వారు గుర్తుచేస్తున్నారు. ఇక ఎమ్మార్వో స్థాయి ప్రభుత్వ ఉద్యోగి జీతభత్యాలు, ఆదాయ వనరులకు అనుగుణంగా ఆస్తులు ఉన్నాయా? ఆదాయానికి మించిన ఆస్తులు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలపై కూడా స్థానికంగా చర్చ జరుగుతోంది. సంబంధిత శాఖలు అవసరమని భావిస్తే చట్టపరమైన విధానంలో ఆదాయ వనరులు, ఆస్తులు, సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. హసన్‌పర్తి మండలంలో భూములకు సంబంధించిన అనేక కీలక అంశాలు ఉండటంతో ఎమ్మార్వో కార్యాలయ పాత్ర అత్యంత ప్రాధాన్యమైనది. పట్టాదారు పాస్‌బుక్కులు, భూ రికార్డులు, మ్యుటేషన్లు, వారసత్వ బదలాయింపులు, ప్రభుత్వ భూములు, చెరువులు, శిఖం భూములు, అసైన్డ్ భూములు, సర్వే రికార్డులు తదితర అంశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఉన్నతాధికారులు సమీక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా వివాదాస్పద భూ వ్యవహారాల్లో ఎవరు దరఖాస్తు చేశారు? ఎవరు సిఫార్సు చేశారు? ఏ అధికారి పరిశీలించారు? ఫైల్‌లో ఏమి నోట్ చేశారు? చివరకు ఏ నిర్ణయం తీసుకున్నారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో తనిఖీలు సాధారణ ప్రక్రియ అయినప్పటికీ, తనిఖీల్లో తప్పులు బయటపడితే వాటిపై చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని ప్రజలు అంటున్నారు. "తనిఖీలు జరుగుతున్నాయి.. కానీ చర్యలు ఎక్కడ?" అనే ప్రశ్న ఇప్పుడు వినిపిస్తోంది. తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి తప్పులు లేవని తేలితే అధికారికంగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. గత కొంతకాలంగా ఎమ్మార్వో కార్యాలయంలో పరిష్కరించిన ముఖ్యమైన దరఖాస్తులు, భూ వివాదాలు, మ్యుటేషన్లు, ధ్రువపత్రాలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన నిర్ణయాలు, ఫైల్ నోటింగ్స్‌పై ఉన్నతస్థాయి అధికారులతో ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ వినిపిస్తోంది. ఫిర్యాదులు వచ్చిన కేసుల్లో ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు, సంబంధిత అధికారుల వివరణలు, రెవెన్యూ రికార్డులు, దరఖాస్తులు, ఫైల్ నోటింగ్స్, అవసరమైతే అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను కూడా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మార్వోపై వస్తున్న ఆరోపణలు నిజమా? రాజకీయ అండ ఉందా? అధికార దుర్వినియోగం జరిగిందా? నిబంధనలకు విరుద్ధంగా ఫైళ్లు పరిష్కరించారా? భూ వ్యవహారాల్లో అక్రమాలకు అవకాశం కల్పించారా? ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం రావాలంటే స్వతంత్రంగా, సమగ్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. కేవలం సాధారణ తనిఖీలతో కాకుండా జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని సామాన్య ప్రజలు, రైతులు, ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్న బాధితులు తమ గోడును ప్రభుత్వం ఆలకించాలని కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల కోసం పనిచేయాల్సినవే తప్ప ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని వారు అంటున్నారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన భూ రికార్డులు, వారసత్వ సమస్యలు, మ్యుటేషన్లు, పట్టా సంబంధిత అంశాల్లో జాప్యం జరిగితే వారి ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయ వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా ప్రజలకు వివరణ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారం కాదు.. నిబంధనలే ప్రాధాన్యం కావాలని, సామాన్య ప్రజలు, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హసన్‌పర్తి ఎమ్మార్వో కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి వస్తేనే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని సామాన్య ప్రజలు, రైతులు, ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్న బాధితుల గోడును ప్రభుత్వం ఆలకించి, కార్యాలయంలో పారదర్శకత పెంచి, నిబంధనలకు విరుద్ధంగా జరిగే వ్యవహారాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## బెంగళూరులోని మెడికవర్ ఆసుపత్రిలో నవజాత శిశువుకు పునర్జన్మ

**85 నిమిషాల్లో వైద్య సేవలు, 33 రోజుల చికిత్స విజయవంతం!**



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో ఒక నవజాత శిశువుకు తలెత్తిన తీవ్రమైన ఆరోగ్య సమస్యను పరిష్కరించే సవాలును స్వీకరించిన వైద్యులు, ఆ శిశువును కేవలం 85 నిమిషాల్లోనే ప్రత్యేక అంబులెన్స్ ద్వారా బెంగళూరులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. సరిగ్గా 33 రోజుల సుదీర్ఘ చికిత్స అనంతరం, ఆ శిశువు పూర్తిగా కోలుకుని ఇంటికి పంపబడింది. ఈ రోజు మెడికవర్ ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వైద్యులు మరియు యాజమాన్యం ఈ వివరాలను పంచుకున్నారు.

**అసలు విషయం ఏమిటి?**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మదనపల్లెకు చెందిన బలే రజని అనే మహిళ యొక్క నవజాత ఆడ శిశువు, పుట్టిన వెంటనే తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో బాధపడింది. శిశువు ఊపిరితిత్తులలోకి మలం ప్రవేశించడం (మెకోనియం ఆస్పిరేషన్ సింద్రోమ్) మరియు గాలి లీకేజీ (న్యూమోథొరాక్స్) కారణంగా ఊపిరితిత్తులు మూసుకుపోవడంతో ఆ శిశువు పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉండటం. అత్యాధునిక ప్రాణరక్షణ సదుపాయాలు కలిగిన 'ప్రత్యేక అంబులెన్స్'లో ఆ శిశువుని మదనపల్లె నుండి బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో ఉన్న మెడికవర్ ఆసుపత్రికి కేవలం 85 నిమిషాల్లోనే సురక్షితంగా తరలించారు.

**వైద్యుల ప్రకటన:**

పత్రికా సమావేశంలో సీనియర్ వైద్యులు డాక్టర్ శివశంకర్ దిగ్గిక్కర్ మరియు డాక్టర్ లతీష్ మాట్లాడుతూ, "శిశువు ఆసుపత్రికి వచ్చినప్పుడు, ఆమె శ్వాసకోశ వ్యవస్థ మరియు రక్తపోటు పూర్తిగా క్షీణించాయి. శిశువుని వెంటనే నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ( ఎన్ఐసియు )లో చేర్పించి, కృత్రిమ శ్వాస ( హై-ఫ్రీక్వెన్సీ ఆసిలేటరీ వెంటిలేషన్), ఇన్హేల్డ్ నైట్రిక్ ఆక్సైడ్ ( ఐఎన్ఓ ) మరియు ఫ్లూయిడ్ థెరపీ అందించారు. 33 రోజుల చికిత్స ద్వారా లారింగోమలేషియా (స్వరపేటిక మృదుత్వం)తో సహా బాలుడి శ్వాసకోశ సమస్యలు మరియు ఇతర సవాళ్లను అధిగమించారు. శిశువు ప్రస్తుతం పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉంది," అని వారు వివరించారు. మెడికవర్ ఆసుపత్రి ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ, "మా నైపుణ్యం గల వైద్యుల బృందం ఈ అత్యంత క్లిష్టమైన, సవాలుతో కూడిన కేసును విజయవంతంగా నిర్వహించింది. అత్యవసర పరిస్థితిలో క్షణాల్లో స్పందించి ఆ చిన్నారి ప్రాణాలను కాపాడగలిగినందుకు మేము గర్విస్తున్నాము. ఈ ప్రాంతంలో త్వరలో మరింత అధునాతనమైన 'పీడియాట్రిక్ కార్డియాలజీ' (పిల్లల గుండె జబ్బులు) విభాగాన్ని ప్రారంభిస్తాము," అని ప్రకటించారు.

**తల్లిదండ్రుల కన్నీళ్లు, ఆనందం:**

33 రోజుల నిరంతర జీవన పోరాటం తర్వాత తమ బిడ్డ పునర్జన్మ పొంది, నవ్వుతూ ఉండటాన్ని చూసి ఆ చిన్నారి తండ్రి, కుటుంబ సభ్యులు తమ ఆనందాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేశారు. "సరైన సమయంలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి, ఒక తల్లిలా బిడ్డను చూసుకున్న మెడికవర్ ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి మేము ఎప్పటికీ కృతజ్ఞులమై ఉంటాము," అని వారు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ శ్రీవల్లి, వైద్యులు డాక్టర్ శివశంకర్ దిగ్గిక్కర్, డాక్టర్ లతీష్, ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆడపడుచుల పండుగ బతుకమ్మ

**కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా సంబరాలు..**
**ప్రకృతితో మమేకమయ్యే పండుగ**
**ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**

**కేయూ క్యాంపస్, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల పండుగని, ప్రకృతితో మమేకమై సంప్రదాయాలను చాటిచెప్పే ఈ వేడుకలో కుటుంబాలు, సమాజం భాగస్వాములవుతాయని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ మహిళా బోధనా, బోధనేతర ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం పరిపాలనా భవన ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మగా పేర్చి, పూజల అనంతరం ప్రకృతికే సమర్పించడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో నివసించే ఆడపడుచులు తమ స్వస్థలాలకు చేరుకుని కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. పాలకమండలి సభ్యురాలు డాక్టర్ రమ మాట్లాడుతూ, ప్రకృతిలో కాలానుగుణంగా చోటుచేసుకునే మార్పులను స్వాగతిస్తూ బతుకమ్మ పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకతగా నిలుస్తుందని అన్నారు. మరో పాలకమండలి సభ్యురాలు కే. అనితా రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల పండుగగా ప్రజలందరినీ ఐక్యం చేసే గొప్ప సాంస్కృతిక వేడుక అని పేర్కొన్నారు. బతుకమ్మలో ఉపయోగించే వివిధ రకాల పూలకు ఔషధ గుణాలు ఉండటం విశేషమని తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్ లాల్, డాక్టర్ ఎన్. సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, అధికారుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సుజాత, బోధనేతర మహిళా ఉద్యోగుల ప్రతినిధి బి. కృష్ణవేణి, నాలుగో తరగతి మహిళా ఉద్యోగుల ప్రతినిధి జి. మల్లికాంబ, అటవీ శాఖ అధికారి ముకుందా రెడ్డి, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. దీంతో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# అన్నదాతకు కరెంట్ కష్టాలు..
# పంటకు నీళ్లెట్లా?

**వరంగల్ ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌పై ఆందోళనలు**
**సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా**
**వరి కోతకు సిద్ధమవుతున్న వేళ విద్యుత్ అంతరాయాలా?**
**లోవోల్టేజీతో మోటార్లకు ముప్పు**
**రైతులపై అదనపు ఆర్థిక భారం**
**కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి!**
**ప్రకటనల్లో హామీలు కాదు.. క్షేత్రస్థాయిలో సరఫరా కావాలి**
**విద్యుత్ సరఫరాపై సమీక్ష ఎక్కడ?**
**రైతుల సమస్యలకు పరిష్కారం ఎప్పుడు?**




**ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 14 (జై భీమ్ న్యూస్)**

వ్యవసాయానికి నీరు ఎంత ముఖ్యమో ఆ నీటిని పొలాలకు అందించేందుకు విద్యుత్ అంతే అవసరం. ముఖ్యంగా బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసే రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం నేరుగా పంటలపై పడుతుంది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, సాగునీటి అవసరాలు పెరగడం వంటి పరిస్థితుల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే రైతులకు కష్టాలు మరింత పెరుగుతాయి. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ ప్రాంతంలోని కొన్ని చోట్ల వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులు, అధికారుల బాధ్యతలపై చర్చ అవసరమవుతోంది. అక్టోబర్ 13న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మద్దతు తెలిపారు. విద్యుత్ అంతరాయాలు, తక్కువ వోల్టేజీ కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలకు సరిపడా నీరు అందక నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళనకారులు పేర్కొన్నారు. ఈ ఘటన ఒక్క ప్రాంతానికి సంబంధించిన రాజకీయ నిరసనగా మాత్రమే కాకుండా, వ్యవసాయ విద్యుత్ సరఫరా తీరుపై క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో పరిశీలించాల్సిన అవసరాన్ని కూడా గుర్తు చేస్తోంది.

### పంట చేతికొచ్చే సమయంలోనే ఇబ్బందులా?

రైతు ఏడాది పొడవునా పంట కోసం శ్రమిస్తాడు. విత్తనాలు కొనుగోలు చేయడం, దుక్కి దున్నించడం, కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగుమందులు, సాగునీటి ఏర్పాట్లు.. ఇలా ప్రతి దశలో పెట్టుబడి పెడతాడు. పంటకు అవసరమైన సమయంలో నీరు అందకపోతే ఆ పెట్టుబడులన్నీ ప్రమాదంలో పడతాయి. ప్రస్తుతం పంటలకు నీరు అవసరమైన కీలక సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా బోర్లు, బావులపై ఆధారపడే రైతులకు విద్యుత్ ఎప్పుడు వస్తుందో ముందుగా తెలియకపోవడం వల్ల సాగు పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం కష్టమవుతుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే మోటార్లు పనిచేయవు. మోటార్లు పనిచేయకపోతే నీరు పొలాలకు చేరదు. నీరు అందకపోతే పంట ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. చివరికి దిగుబడి తగ్గితే రైతు ఆదాయం కూడా తగ్గిపోతుంది. ఈ సమస్యను కేవలం విద్యుత్ కోతగా చూడకుండా, రైతు కుటుంబ ఆర్థిక పరిస్థితితో ముడిపడిన అంశంగా చూడాల్సిన అవసరం ఉంది.

### లోవోల్టేజీ సమస్య.. రైతుకు మరో ఆర్థిక భారం

విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ తగిన వోల్టేజీ లేకపోతే రైతులకు ఉపయోగం ఉండదు. తక్కువ వోల్టేజీతో మోటార్లు సక్రమంగా పనిచేయకపోవడం, పరికరాలు దెబ్బతినే ప్రమాదం ఉండటం వంటి సమస్యలు ఎదురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటారు మరమ్మతులకు ఖర్చు చేయడం, అవసరమైతే కొత్త పరికరాలు కొనుగోలు చేయడం రైతుకు అదనపు భారమే. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులతో సతమతమవుతున్న రైతుకు విద్యుత్ సమస్యల కారణంగా మరో ఖర్చు ఎదురైతే పరిస్థితి మరింత కష్టమవుతుంది.అయితే ఏయే ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య ఉంది? ఎన్ని మోటార్లు దెబ్బతిన్నాయి? ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ ఉందా? విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలున్నాయా? అనే అంశాలపై అధికారిక గణాంకాలు, క్షేత్రస్థాయి పరిశీలన అవసరం. ఈ వివరాలు లేకుండా సమస్యకు ఒకే కారణాన్ని ఆపాదించడం సరికాదు.

### విద్యుత్ సరఫరా వేళలు ఒకటైతే.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మరొకటా?

వ్యవసాయానికి నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఆ సరఫరా వాస్తవంగా ఎంతసేపు అందుతోంది? మధ్యలో ఎన్ని అంతరాయాలు ఏర్పడుతున్నాయి? రైతులకు అవసరమైన వోల్టేజీ అందుతోందా? అనే అంశాలను పరిశీలించాల్సి ఉంది. రైతులు ఫిర్యాదు చేసినప్పుడు సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తున్నారా? ఒకే ఫీడర్ పరిధిలో పదేపదే అంతరాయాలు ఏర్పడుతుంటే వాటి కారణాలను గుర్తిస్తున్నారా? మరమ్మతుల పేరుతో సరఫరా నిలిపివేస్తే ముందుగా సమాచారం అందిస్తున్నారా? వంటి ప్రశ్నలకు సమాధానాలు అవసరం. సరఫరా చేస్తున్నట్లు రికార్డుల్లో చూపించడం ఒక అంశమైతే, రైతు పొలంలో మోటారు సక్రమంగా పనిచేసి పంటకు నీరు అందడం మరో అంశం. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలుసుకోవాలంటే ఫీడర్ వారీగా సరఫరా వివరాలు, అంతరాయాల నమోదు, వోల్టేజీ స్థాయులు, రైతుల ఫిర్యాదుల పరిష్కార నివేదికలను పరిశీలించాలి.

### విద్యుత్ డిమాండ్ పెరుగుదల.. వ్యవసాయంపై ప్రభావం ఎంత?

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సరఫరా వ్యవస్థపై ఒత్తిడి ఏర్పడుతోందని ఇటీవల వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఉమ్మడి వరంగల్ ప్రాంతంలోనూ విద్యుత్ డిమాండ్ పెరుగుదల, వ్యవసాయ సరఫరాలో అంతరాయాలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నివేదికలు వెలువడ్డాయి. అయితే విద్యుత్ డిమాండ్ పెరగడమే ప్రతి అంతరాయానికి కారణమని నిర్ధారించలేం. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సామర్థ్యం, ఫీడర్ల పరిస్థితి, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం, నిర్వహణ పనులు, స్థానిక సాంకేతిక లోపాలు వంటి అనేక అంశాలు సరఫరాపై ప్రభావం చూపవచ్చు. అందుకే విద్యుత్ శాఖ అధికారులు ప్రాంతాలవారీగా సమస్యలను గుర్తించి, ఎక్కడ సామర్థ్యం పెంచాలి? ఎక్కడ పాత లైన్లు మార్చాలి? ఎక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి.

### ధర్నా చేసినప్పుడే స్పందనా?

చెల్పూర్‌లో రైతులు ధర్నా నిర్వహించిన నేపథ్యంలో మరో ప్రశ్న కూడా ముందుకొస్తోంది. రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపినప్పుడే సమస్య అధికారుల దృష్టికి వస్తుందా? అంతకుముందు అందిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? సమస్యలు పునరావృతం కాకుండా ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టారు? రైతులు సబ్‌స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదులు చేయడం, ధర్నాలు నిర్వహించడం వారి సాగు పనులకు అదనపు ఆటంకమే. పొలంలో ఉండాల్సిన రైతు విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడితే, అది సమస్య పరిష్కార విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, సమస్య పరిష్కారానికి పట్టే సమయాన్ని నిర్ణయించి, పరిష్కారం పూర్తయిన తర్వాత రైతుకు సమాచారం అందించే వ్యవస్థ ఉండాలి. ఒకే ప్రాంతం నుంచి పదేపదే ఫిర్యాదులు వస్తుంటే వాటిని విడివిడిగా చూడకుండా, మూలకారణాన్ని గుర్తించే ప్రయత్నం చేయాలి.

### అధికారులు సమాధానం చెప్పాల్సిన కీలక ప్రశ్నలు

వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతుల ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ, జిల్లా యంత్రాంగం కింది అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

1. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు నిర్ణయించిన సరఫరా వేళలు ఏమిటి? వాస్తవంగా ఎన్ని గంటలు విద్యుత్ అందుతోంది?
2. చెల్పూర్ పరిధిలో విద్యుత్ అంతరాయాలకు ప్రధాన కారణాలేమిటి?
3. తక్కువ వోల్టేజీ సమస్య ఉందా? ఉంటే దాని పరిష్కారానికి ఏ చర్యలు తీసుకున్నారు?
4. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు ఫిర్యాదులు అందాయా? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?
5. వ్యవసాయ ఫీడర్ల వారీగా సరఫరా, అంతరాయాల వివరాలను అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారా?
6. రైతులు చేసిన ఫిర్యాదులపై ఎన్ని పరిష్కరించారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి?
7. పంట నష్టం జరిగిందని రైతులు ఫిర్యాదు చేస్తే వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహిస్తుందా?
8. విద్యుత్ సమస్యలు పునరావృతం కాకుండా జిల్లా స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేపడతారా?

ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు ఆధారాలతో సమాధానాలు ఇస్తేనే సమస్య తీవ్రత, బాధ్యత, పరిష్కార మార్గాలపై స్పష్టత వస్తుంది.

### పంట నష్టంపై అంచనా.. రైతులకు భరోసా అవసరం

విద్యుత్ సరఫరా సమస్యల వల్ల పంటలకు నష్టం జరిగిందని రైతులు చెబుతున్న ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలి. పంటల పరిస్థితి, నీటి లభ్యత, విద్యుత్ అంతరాయాల వ్యవధి, నష్టానికి గల కారణాలను పరిశీలించి వాస్తవాలను నమోదు చేయాలి.విద్యుత్ సమస్య కారణంగా పంట నష్టం జరిగిందని చెప్పడం మాత్రమే పరిహారానికి సరిపోదు. నష్టం ఎంత జరిగింది? దానికి కారణాలేమిటి? సంబంధిత ప్రభుత్వ పథకాలు, నిబంధనల ప్రకారం పరిహారానికి అర్హత ఉందా? అనే అంశాలను పరిశీలించాలి. అర్హత ఉన్న రైతులకు వర్తించే నిబంధనల ప్రకారం సహాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.అదే సమయంలో విద్యుత్ సరఫరా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలను అందుబాటులో ఉంచడం, ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించడం, సరఫరా వేళల్లో మార్పులుంటే ముందస్తు సమాచారం ఇవ్వడం వంటి చర్యలు రైతులకు ఉపశమనం కలిగించగలవు.

### ప్రభుత్వానికి, విద్యుత్ శాఖకు ఇది పరీక్షే!

రైతు పంట పండితేనే వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబానికి ఆదాయం వస్తుంది. వ్యవసాయం బాగుంటేనే దాని ప్రభావం గ్రామీణ వ్యాపారాలు, కూలీల ఉపాధి, స్థానిక మార్కెట్లపై సానుకూలంగా ఉంటుంది. అందువల్ల వ్యవసాయ విద్యుత్ సరఫరాను కేవలం ఒక శాఖ నిర్వహణ అంశంగా కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక సమస్యగా చూడాలి. విద్యుత్ శాఖ అధికారులు సరఫరా వివరాలను సమీక్షించాలి. వ్యవసాయ శాఖ పంటల పరిస్థితిని పరిశీలించాలి. జిల్లా యంత్రాంగం సంబంధిత శాఖల మధ్య సమన్వయం కల్పించాలి. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, వాటి పరిష్కారానికి గడువుతో కూడిన చర్యలు తీసుకోవాలి.రైతులు ధర్నాలు చేసిన తర్వాత స్పందించడం కంటే, సమస్య తీవ్రరూపం దాల్చకముందే గుర్తించి పరిష్కరించడం సమర్థవంతమైన పరిపాలనకు నిదర్శనం.

### హామీలకంటే అమలే ముఖ్యం

చెల్పూర్‌లో రైతులు నిర్వహించిన ధర్నా వ్యవసాయ విద్యుత్ సరఫరాపై వారి ఆందోళనను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ఈ సమస్యకు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు మాత్రమే పరిష్కారం కావు. వాస్తవ పరిస్థితులను పరిశీలించడం, సాంకేతిక కారణాలను గుర్తించడం, సరఫరాలో లోపాలను సరిదిద్దడం, రైతుల ఫిర్యాదులకు స్పందించడం ద్వారానే సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.ప్రభుత్వం వ్యవసాయానికి విద్యుత్ అందిస్తున్నామని చెప్పడం ఒకవైపు.. రైతు తన పొలంలో మోటారు ఆన్ చేసి పంటకు నీరు అందించగలగడం మరోవైపు. ఈ రెండింటి మధ్య అంతరం ఉంటే దాన్ని గుర్తించి సరిదిద్దాల్సిన బాధ్యత అధికారులదే. రైతు పొలంలో పంట ఎండిపోయిన తర్వాత స్పందించడం కంటే, పంట ఎండిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ముఖ్యం. విద్యుత్ సరఫరాపై వస్తున్న ఆరోపణలు, రైతుల ఫిర్యాదులపై సమగ్ర సమీక్ష నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన సమయం ఆసన్నమైంది.

– (జై భీమ్ న్యూస్ అధికార ప్రతినిధి హన్మకొండ శ్రీకాంత్)

# అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే టమాటా



**అభివృద్ధిపై పరిశోధనాత్మక పుస్తక ఆవిష్కరణ**
**వాతావరణ మార్పులను తట్టుకునే పంటల అభివృద్ధికి పరిశోధనలు దోహదం**
**కేయూ వీసీ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**

**కేయూ క్యాంపస్, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే టమాటా రకాల అభివృద్ధికి సంబంధించిన పరిశోధనలు వ్యవసాయ రంగానికి ప్రయోజనకరంగా నిలుస్తాయని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ జీవసాంకేతిక శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ఎన్. రామస్వామి నేతృత్వంలో పరిశోధకులు డాక్టర్ విక్రం గొడిశాల, డాక్టర్ రజనీకాంత్ మరక రచించిన 'అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే జన్యుమార్పిడి టమాటా' పరిశోధనాత్మక పుస్తకాన్ని బుధవారం విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలోని ఉపకులపతి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే టమాటా రకాల అభివృద్ధిపై చేపట్టిన పరిశోధనలు అభినందనీయమన్నారు. ఈ సాంకేతికత ద్వారా రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాట్ల తేదీలను మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా టమాటా సాగుకు అనుకూలంగా లేని ప్రాంతాల్లోనూ పంట సాగు అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పరిశోధనలకు కృషి చేసిన ఆచార్య ఎన్. రామస్వామి, డాక్టర్ విక్రం గొడిశాల, డాక్టర్ రజనీకాంత్‌లను అభినందించారు. పుస్తక రచయిత ఆచార్య ఎన్. రామస్వామి మాట్లాడుతూ, వేడిని తట్టుకునే పంటల అభివృద్ధికి వినియోగించిన సాంకేతికతను వేడికి సున్నితంగా స్పందించే ఇతర కూరగాయలతో పాటు వరి వంటి పంటల అభివృద్ధిలోనూ అన్వయించే అవకాశాలున్నాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే పరిస్థితుల్లో అధిక వేడిని తట్టుకునే పంటల అభివృద్ధికి ఈ తరహా పరిశోధనలు ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ప్రత్యేక విధుల అధికారి ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, డాక్టర్ బి. రమ, జీవసాంకేతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ టి. శాస్త్రి, డాక్టర్ లక్ష్మణ్, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శేషాచలం, ఉపప్రిన్సిపాల్ డాక్టర్ పి. హరేందర్ రెడ్డి, డాక్టర్ జి. రాజప్రసాద్, డాక్టర్ బాలరాజు, డాక్టర్ కే. హిమబిందు, డాక్టర్ పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుల పరిరక్షణకు ఎమ్మార్పీఎస్ పోరాటం

**సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలి**
**ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల మంది ఓట్లు తొలగించారన్న కేదాసి మోహన్ మాదిగ**

**హైదరాబాద్,14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఓటు హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కేదాసి మోహన్ మాదిగ డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) పేరుతో 13 కోట్ల మంది పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వలస కార్మికుల ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఫారం-6లో చట్టవిరుద్ధంగా మార్పులు చేశారని, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు విఘాతం కలిగిస్తాయని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేసి, తొలగించినట్లు ఆరోపిస్తున్న ఓట్లను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేతతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా భాగస్వామ్యం కల్పించేలా నియామక విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్న మోహన్ మాదిగ, ఈ పోరాటం రాజకీయ పార్టీల మధ్య పోరాటం కాదని, ఓటు హక్కు కలిగినవారికి, ఆ హక్కును కోల్పోయినవారికి సంబంధించిన సమస్య అని అభివర్ణించారు. ఓట్లు తొలగించబడ్డాయని ఆరోపిస్తున్న దళిత, బహుజన వర్గాలకు న్యాయం జరిగే వరకు మేడి పాపయ్య నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ముందుండి పోరాడుతుందని తెలిపారు.



# పని ప్రదేశాల్లో మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

**పోష్ చట్టంపై అవగాహన అవసరం**
**డాక్టర్ అనితా రెడ్డి**

**హన్మకొండ, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోష్ కమిటీ కన్వీనర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి తెలిపారు. ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుబేదారీలోని సంస్థ కార్యాలయంలో బుధవారం పోష్ చట్టం--2013పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనితా రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు, చట్టపరమైన రక్షణలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వేధింపులు ఎదురైతే సంబంధిత కమిటీకి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచాలని తెలిపారు. ప్రతి సంస్థ, కార్యాలయం, పాఠశాల, కళాశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి, సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. వ్యవసాయ రంగంలోని మహిళా కార్మికులకు సైతం ఈ చట్టంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం పోష్ చట్టంపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాంమూర్తి, శ్రీనివాస్, రమేష్, పోష్ కమిటీ సభ్యులు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.



# నేనెప్పుడూ పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడినే!

**ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నా**
**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**దీన్‌దయాళ్ నగర్‌లో రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన**



**శాయంపేట,14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన క్యాంపు కార్యాలయం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31, 50వ డివిజన్ల పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాయంపేట డివిజన్‌లో గత మూడేళ్లుగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పలు కాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందేలా కృషి చేశామని పేర్కొన్నారు. ఇంకా ఇళ్లు మంజూరు కావాల్సిన అర్హులైన లబ్ధిదారుల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వారికి కూడా లబ్ధి చేకూరేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు పలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, కొన్ని సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి మార్క విజయ్, మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, మాజీ అధ్యక్షుడు సురేందర్, కాలనీ నాయకులు అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చితార్థ వేడుకలో సందడి చేసిన రాజనాల శ్రీహరి..

**నూతన జంటకు ఆశీస్సులు**



**వరంగల్, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కరీమాబాద్‌కు చెందిన గదులపాటి రాజశేఖర్ కుమారుడు రాజేష్ నిశ్చితార్థ వేడుకలో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి పాల్గొని నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బొల్లం ప్రతాప్, బొల్లం మధు, బొల్లం రాజు, నాగవెల్లి ప్రవీణ్ కుమార్, మాగంటి శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**హన్మకొండ, అక్టోబర్ 14 (జై భీమ్ న్యూస్)**




కాకతీయ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో బతుకమ్మ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా వేడుకలు సందడిగా సాగాయి. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఇన్‌ఛార్జ్ సభ్యురాలు డాక్టర్ బి. రాధికా రాణి, సెరికల్చర్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ కె. సుజాత, మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ సుజాత పాల్గొన్నారు. లైబ్రరీ అసిస్టెంట్లు టి. జవేర్, సుమలత, యు. రాజు, ఇందిరతో పాటు ఇతర సిబ్బంది, విద్యార్థినులు అఖిల, జ్యోతి, రాధిక తదితరులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, లైబ్రరీ సిబ్బంది, విద్యార్థులు కలిసి బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ద్వారా పరస్పర ఐక్యత, స్నేహభావం మరింత బలోపేతమయ్యాయి. తెలంగాణకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను భావితరాలకు అందించడంతో పాటు రాష్ట్ర సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయి.

## మడికొండలో గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్ట్

**వరంగల్, అక్టోబర్ 14 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయం, వినియోగంపై పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మడికొండ ఎస్ఐ పి. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గుర్తించి విచారించారు. ఈ క్రమంలో కొత్త శశికుమార్ (26), మడికొండ, మంతిరి మధును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద తనిఖీలు నిర్వహించగా గంజాయి లభించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి గంజాయిని సీజ్ చేశారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా మడికొండ ఇన్‌స్పెక్టర్ పి. కిషన్ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# ఇటలీలో ఉద్యోగ అవకాశాలు..

**నర్సింగ్ అభ్యర్థులకు సువర్ణావకాశం**



PRESS NOTE Dt : 14/10/2026

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ద్వారా ఖతార్‌లో ఉద్యోగాల కోసం లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్సులు (LPN) మరియు నర్స్ టెక్నీషియన్లు (NT) నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. హోమ్‌కేర్ సేవల్లో రోగులకు సంరక్షణ అందించగల అభ్యర్థులకు, అనుభవం ఉన్న నర్సింగ్ నిపుణులకు ఈ ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నాయి. అభ్యర్థుల ఎంపిక విద్యార్హతలు, సంబంధిత పని అనుభవం, క్లినికల్ నైపుణ్యాలు మరియు అర్హతల ఆధారంగా జరుగుతుంది.

**ఉద్యోగ వివరాలు**

- ఉద్యోగాలు: లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్సులు (LPN) మరియు నర్స్ టెక్నీషియన్లు (NT)
- దేశం: ఖతార్
- లింగం: మహిళలు మరియు పురుషులు
- వయస్సు: 20–40 సంవత్సరాలు
- పని అనుభవం:

నర్స్ టెక్నీషియన్ (NT): కనీసం 1 సంవత్సరం
లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్స్ (LPN): కనీసం 2 సంవత్సరాలు

- పని చేసే విభాగం: హోమ్‌కేర్ (ఇంటి వద్ధ రోగులకు సంరక్షణ)
- జీతం: నర్స్ టెక్నీషియన్ (NT) నెలకు ₹73,000/-; లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్స్ (LPN) నెలకు ₹95,000/-

**ప్రొఫెషనల్ పరీక్ష అవసరం లేదు**

**అభ్యర్థులకు కల్పించే ప్రయోజనాలు**

- ఉద్యోగ వీసా
- విమాన ప్రయాణ టికెట్
- నిర్దేశిత పికప్ / డ్రాప్ పాయింట్‌కు రవాణా సౌకర్యం
- వసతి సౌకర్యం
- ప్రాథమిక వైద్య బీమా

**ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన వివరాలు**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM)
ఫోన్ నంబర్: 08035524946

**హన్మకొండ, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా ఇటలీలో నర్సింగ్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయం వెల్లడించింది. లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్సులు (ఎల్‌పీఎన్), నర్సింగ్ టెక్నీషియన్లు (ఎన్‌టీ) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఈ ఉద్యోగాలకు మహిళలు, పురుషులు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 20 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి. నర్సింగ్ టెక్నీషియన్లకు కనీసం ఒక సంవత్సరం, లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్సులకు కనీసం రెండు సంవత్సరాల పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి. ఆసుపత్రుల్లో, అలాగే ఇంటి వద్ద రోగుల సంరక్షణ సేవల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఎంపికైన నర్సింగ్ టెక్నీషియన్లకు నెలకు రూ.73 వేల వరకు, లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్సులకు నెలకు రూ.95 వేల వరకు వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగ వీసా, విమాన ప్రయాణ టికెట్, నైపుణ్య పరీక్ష, శిక్షణకు రవాణా సౌకర్యం, వసతి, వైద్య బీమా వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కార్యాలయం సూచించింది. వివరాల కోసం 08035524946 ఫోన్ నంబర్‌ను లేదా tomcom-global@gmail.com ఈ-మెయిల్‌ను సంప్రదించాలని తెలిపింది.

# ఉపాధ్యాయ ఓటర్ల జాబితాల తయారీలో పారదర్శకత పాటించాలి

**జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి**

**రాజమహేంద్రవరం, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితాల పునఃతయారీని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు, ఎన్నికల సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఓటర్ల నమోదు ప్రక్రియను సమీక్షించారు. నవంబర్ 1, 2026 అర్హత తేదీగా నిర్ణయించామని, అర్హులైన ఉపాధ్యాయులు ఫారం--19 ద్వారా నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత ఆరు సంవత్సరాల్లో కనీసం మూడేళ్లు అర్హత కలిగిన విద్యాసంస్థల్లో పూర్తికాల ఉపాధ్యాయులుగా పనిచేసినవారు మాత్రమే ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. సేవా ధ్రువపత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని, డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబర్ 30న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

**బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పటిష్ట బందోబస్తు.. ముమ్మర పెట్రోలింగ్‌కు ఆదేశాలు**





**వరంగల్, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల ప్రగతిపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్ అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటి దర్యాప్తు ఏ దశలో ఉందనే విషయాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల్లో నిందితులు పరారీలో ఉన్నట్లయితే వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ త్వరితగతిన అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని దర్యాప్తును వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని, దర్యాప్తులో జాప్యం కారణంగా కేసులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కేసులను ఛేదించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా దర్యాప్తును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా రానున్న బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకునేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అదనపు డీసీపీలు రాయల ప్రభాకర్ రావు, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డితో పాటు పలువురు సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్ అధికారులు పాల్గొన్నారు.

# రీ-సర్వేపై అపోహలు వీడి ప్రజలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

భూముల రీ-సర్వే ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, రీ-సర్వేలో రైతులు, భూ యజమానులు చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన భూముల రీ-సర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ-సర్వే ద్వారా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ రికార్డుల్లోని వివరాలపై స్పష్టత ఏర్పడి, పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, రికార్డుల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. రీ-సర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసరావు, వరంగల్ ఆర్డీవో సుమ, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి, గోపనపల్లి సర్పంచ్ నాంపల్లి విజయ, అనంతరం సర్పంచ్ తోట శ్రీలత, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మహాలక్ష్మి అలంకరణలో భద్రకాళీ అమ్మవారి దర్శనం

**సూర్యప్రభపై సావిత్రిగా.. హంస వాహనంపై బ్రాహ్మీమాతగా అమ్మవారి ఊరేగింపు**



**వరంగల్, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. బుధవారం రోజున ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం పూర్తి చేసిన అనంతరం అమ్మవారికి మహాలక్ష్మి అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. నవదుర్గా కల్పోక్త నవరాత్ర పూజా విధానాన్ని అనుసరించి అమ్మవారిని కూష్మాండీ, గిరిజా క్రమాలలో పూజారాధనలు నిర్వహించారు. మహాలక్ష్మి రూపంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అఖండ ఐశ్వర్యం, సకల శుభాలు కలుగుతాయని, కూష్మాండాదేవి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో ధ్యానించి పూజించడం ద్వారా అసురీ శక్తులు దూరమవుతాయని, గిరిజా క్రమంలో అమ్మవారిని ఆరాధించడం ద్వారా సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. నవరాత్రి నాల్గవ రోజు సాధకుని మనస్సు అనాహత చక్రంలో స్థిరమవుతుందని, ఈ రోజున పవిత్రమైన మనస్సుతో అమ్మవారిని ధ్యానించి పూజించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం సూర్యప్రభ వాహనంపై అమ్మవారిని సావిత్రి మాతగా, సాయంత్రం హంస వాహనంపై బ్రాహ్మీమాతగా అలంకరించి వైభవంగా ఊరేగించారు. సూర్యప్రభ వాహనంపై సావిత్రి మాతగా అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా ధర్మంపై శ్రద్ధ, విశ్వాసం ఏర్పడుతుందని, "యతో ధర్మస్తతో జయః" అన్న శాస్త్రవచనం ప్రకారం ధర్మాన్ని నమ్ముకున్నవారికి విజయం సిద్ధిస్తుందని తెలిపారు. హంస వాహనంపై బ్రాహ్మీమాతగా అమ్మవారిని దర్శించడం ద్వారా మేధాశక్తి పెరిగి మంచి, చెడును విచక్షణతో గుర్తించే శక్తి కలుగుతుందని వివరించారు. బుధవారం రోజున పూజా కార్యక్రమాలకు గండ్ర భూపాల్ రెడ్డి--రూపా దంపతులు, గండ్ర అభిలాష్ రెడ్డి--దివ్య దంపతులు, గండ్ర సాయికృష్ణా రెడ్డి--భావనాంజలి దంపతులు, అనసూరి శ్రీనివాస్--బాలజనని దంపతులు, అట్టం శంతన్ పటేల్--శ్రీగంధ దంపతులు, ముప్పిడి సుధీర్ రెడ్డి--అర్పిత దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయదాతలకు శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను ఆలయ ఈఓ రామల సునీత పర్యవేక్షించారు. శ్రీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అశేష అన్నదానం నిర్వహించారు. ఇదిలా ఉండగా తొగుట పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతీ స్వామివారు శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన స్వామివారికి ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ మహామండపంలో భక్తులను ఉద్దేశించి స్వామివారు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం దేవాలయంలో నిర్మాణం జరుగుతున్న నూతన రథాన్ని పరిశీలించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారి మహాలక్ష్మి రూపాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంకులో దళారులదే హవా

**ప్రతి లోన్‌కు ఒక రేటు.. దళారుల ద్వారా రుణాల మంజూరు అంటూ రైతుల ఆరోపణలు**




**ఆత్మకూర్, అక్టోబర్ 14 (జై భీమ్ న్యూస్)**

గ్రామీణ ప్రాంతాల నిరుపేదలు, రైతులు, చిన్న వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలవాల్సిన యూనియన్ బ్యాంకులో దళారులదే హవా కొనసాగుతోందని పలువురు రైతులు, ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఆత్మకూర్ మండలం నీరుకుళ్ల గ్రామంలోని యూనియన్ బ్యాంకులో ఏ రుణం కావాలన్నా ముందుగా దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. రుణం మంజూరు కావాలంటే పర్సంటేజీలు చెల్లించాల్సి వస్తోందని, ప్రతి రుణానికి ఒక రేటు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా బ్యాంకు అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకుండా, ముందుగా గుండాల వీరన్నను కలవాలని సూచిస్తున్నారంటూ పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి ఉదాహరణగా మండలంలోని అగ్రంపాడు గ్రామానికి చెందిన రాజన్న అల్లుడు, దుగ్గొండి మండలం గుడ్డెలుగులపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం అనే రైతు వ్యవసాయ రుణం కోసం బ్యాంకును ఆశ్రయించినట్లు రైతు వర్గాలు చెబుతున్నాయి. రుణం కోసం పలుమార్లు బ్యాంకు చుట్టూ తిరిగినా మంజూరు కాకపోవడంతో చివరకు మధ్యవర్తిని ఆశ్రయించాల్సి వచ్చిందని, అనంతరం రుణం మంజూరు చేయించినందుకు లక్ష రూపాయల రుణానికి రూ.6,000 చెల్లించాలని డిమాండ్ చేసి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలపై బ్యాంకు అధికారులు, సంబంధిత వ్యక్తుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. వ్యవసాయ రుణాలతో పాటు వ్యాపార రుణాలు, వ్యక్తిగత రుణాలు, స్వయం ఉపాధి కోసం తీసుకునే రుణాల విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందని బ్యాంకు పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణం కోసం బ్యాంకు చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయి, అత్యవసర పరిస్థితుల్లో దళారులకు పర్సంటేజీలు ఇవ్వడం తప్పడం లేదని చెబుతున్నారు. దీంతో రైతులు, పేదలు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంటున్నారు. బ్యాంకింగ్ సేవలు పారదర్శకంగా అందాల్సిన చోట మధ్యవర్తుల ప్రమేయం ఎలా పెరిగిందనే విషయంపై బ్యాంకు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రుణాల దరఖాస్తులు, మంజూరు ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, మధ్యవర్తుల జోక్యం తదితర అంశాలపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి దళారుల వ్యవస్థకు అడ్డుకట్ట వేసి రైతులు, పేదలు నేరుగా బ్యాంకింగ్ సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ






**కాజీపేట, అక్టోబర్ 14(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ బుధవారం సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం సిబ్బంది కిట్టాటికల్స్‌ను పరిశీలించారు. అనంతరం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ సిబ్బందితో సమావేశమై వారి విధులు, సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ విధుల నిర్వహణ, నిబంధనలు, ట్రాఫిక్ రెగ్యులరైజేషన్‌పై సిబ్బందికి సవివరంగా సూచనలు చేశారు. విధుల నిర్వహణలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఏసీపీ సూచించారు. ఎలాంటి విషయంలోనూ రాజీ పడకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించేలా పనిచేయాలని ఆదేశించారు.

# బాలికలు తమ హక్కులు, రక్షణపై అవగాహన కలిగి ఉండాలి










**సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దు - వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్**

**హన్మకొండ, అక్టోబర్ 14(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

బాలికలు తమ హక్కులు, భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని ఆమె హెచ్చరించారు. సైబర్ వేధింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికల భద్రత, మహిళా రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సైబర్ నేరాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్స్ ఏసీపీ సదయ్య నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి బాలికా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, కౌమార దశలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమించి జీవిత లక్ష్యాలను సాధించే దిశగా బాలికలు ముందుకు సాగాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు మానసిక, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవాలని, అవసరమైన సమయంలో షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సైకాలజిస్ట్ డాక్టర్ బారుపాటి గోపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను విచక్షణతో వినియోగిస్తూ సైబర్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్. రాధిక మాట్లాడుతూ కౌమార దశలో కలిగే శారీరక, మానసిక మార్పులపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. బాలికల భద్రత, సాధికారత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ తరఫున ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలను ధైర్యంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అదనపు డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు సదయ్య, వెంకటరమణ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఏ.హెచ్.టి.యు ఇన్‌స్పెక్టర్ ఓ. రమేష్, భరోసా సెంటర్ ఎస్ఐ కిరణ్మయి, షీ టీమ్స్ ఆర్ఎస్ఐ స్వాతి, ఎస్ఐ రామారావుతో పాటు పలువురు పోలీస్ అధికారులు, వరంగల్ జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన బాలికలు, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సురక్షిత సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం: ఇన్‌స్పెక్టర్ మహేందర్

**హసన్‌పర్తి, అక్టోబర్ 14 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (సంఘమిత్ర)లో భాగంగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ నేరాలు, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా తల్లిదండ్రులు, మహిళా సంఘాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో భద్రతను మరింత పెంచేందుకు కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మహిళలు, బాలల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఇన్‌స్పెక్టర్ భరోసా ఇచ్చారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు లేదా నేరస్తుల కదలికలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో మహిళలను భాగస్వామ్యం చేస్తూ, స్వయం సహాయక సంఘాలతో పోలీసులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ సురక్షిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఏపీఎం నారాయణ మాట్లాడుతూ, మహిళా స్వయం సహాయక సంఘాలు కేవలం ఆర్థిక స్వావలంబనకే పరిమితం కాకుండా గ్రామాభివృద్ధి, సామాజిక సమస్యల పరిష్కారంలోనూ కీలక పాత్ర పోషించాలని అన్నారు. డ్రగ్స్, బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు, సైబర్ మోసాలు వంటి సమస్యలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మహిళల భద్రత, కుటుంబాల సంక్షేమం, గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఏపీఎం నారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, పోలీస్ సిబ్బంది, సీసీ పద్మ, వీఏఓ రజిత, మండల స్థాయి మహిళా సమైక్య ప్రతినిధులు, గ్రామ మహిళా సమైక్య సంఘ అధ్యక్షులు, కోశాధికారి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ వాహనదారులపై వరంగల్ ట్రాఫిక్ పోలీసుల కఠిన చర్యలు

**8 మంది మైనర్లకు ఒక రోజు అబ్జర్వేషన్ హోమ్.. తల్లిదండ్రులకు హెచ్చరిక**

**వరంగల్, అక్టోబర్ 14 (జై భీమ్ న్యూస్)**

మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని వరంగల్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మైనర్ డ్రైవింగ్ చేస్తున్న 8 మంది బాలలను గుర్తించి, వారిపై జువెనైల్ కోర్టులో చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. కేసులను విచారించిన గౌరవ జువెనైల్ మేజిస్ట్రేట్ 8 మంది మైనర్ బాలలను ఒక రోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇకపై కూడా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి, చార్జ్‌షీట్లు దాఖలు చేసి కోర్టు ముందు హాజరుపరుస్తామని పోలీసులు స్పష్టం చేశారు. అలాగే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురు వాహనదారులను కోర్టు ముందు హాజరుపరచగా, వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ అంకేశ్వరపు కమలాకర్ వారికి మొత్తం రూ.800 జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 13 మందిని కోర్టు ముందు హాజరుపరచగా, వారికి మొత్తం రూ.10,800 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత సూచించారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు అంగీకారం



**హన్మకొండ, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో గుర్తించిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు చేసేందుకు థానా కమిటీ సభ్యులు అంగీకరించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఐఏఎస్ సమక్షంలో ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని గుర్తించిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పథకం అమలుకు సంబంధిత ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు పూర్తి సహకారం అందించాలని కోరారు. అర్హులైన ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో గుర్తించిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు థానా కమిటీ సభ్యులు అంగీకరించడం సంతోషకరమన్నారు. పథకానికి సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ అర్హులైన ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో థానా కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాకేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్, సభ్యులు డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ విజయ్, డాక్టర్ బి. మోహన్‌రావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్, డాక్టర్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల భద్రతకు 'నిర్భయ నిధి' కింద ములుగు జిల్లా ఎంపిక



**ములుగు, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

మహిళలు, బాలికల భద్రత, రక్షణ, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ సురక్షితమైన సమగ్ర పట్టణాల అభివృద్ధి కోసం చేపట్టనున్న ప్రయోగాత్మక ప్రాజెక్టుకు నిర్భయ నిధి కింద ములుగు జిల్లా ఎంపికైంది. ఈ ప్రాజెక్టు అమలు, కార్యాచరణ ప్రణాళికపై కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. సమావేశంలో ప్రాజెక్టు అమలుకు అవసరమైన ప్రణాళికలు, వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల కల్పన, మహిళలు, బాలికల భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో ప్రతిపాదిత కార్యక్రమాలు, శాఖల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలు, బాలికలకు సురక్షితమైన ప్రజా ప్రదేశాలను అభివృద్ధి చేయడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. సమాన అవకాశాలు, సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తూ మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహం అందించనున్నారు. అలాగే మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మహిళల సాధికారతకు చర్యలు చేపట్టడం, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మహిళా ఉద్యోగులు, అసంఘటిత రంగాల్లో పనిచేసే మహిళలు తమ సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకునేందుకు అనువైన వేదికను కల్పించే అంశాన్ని కూడా ప్రాజెక్టులో పరిశీలించనున్నారు. ఇందుకోసం 'నిర్భయ సదన్' వంటి ప్రతిపాదిత కార్యక్రమాలను అమలు చేసే అంశంపై దృష్టి సారించనున్నారు. ములుగు జిల్లా ఈ ప్రాజెక్టుకు ఎంపిక కావడం మహిళలు, బాలికల భద్రత, గౌరవం, స్వావలంబనకు మరింత దోహదపడుతుందని అధికారులు తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసి మహిళలు, బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయనుంది. సమీక్షా సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత పాల్గొన్నారు.

జై భీమ్ — POWER OF PEOPLE

## ఆర్ఎస్‌డబ్ల్యూఓ ఆధ్వర్యంలో ఘనంగా సైనిక, మాజీ సైనిక కుటుంబాల బతుకమ్మ సంబరాలు

**హనుమకొండ, 14 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**




తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రీజినల్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్ లో యర్నం మాధవీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సైనిక, మాజీ సైనిక కుటుంబాల మహిళలు ఉత్సాహంగా పాల్గొని పూల బతుకమ్మలతో వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జనరల్ సెక్రటరీ రామకృష్ణ గౌడ్, హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షుడు బిట్ల వేణుగోపాల్ నేత, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ నేత, కళా సాహిత్య అవార్డు గ్రహీత వీఆర్ రాములు పాల్గొన్నారు. వీరితోపాటు సైనిక, మాజీ సైనిక కుటుంబాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. సైనిక, మాజీ సైనిక కుటుంబాల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందించడంతోపాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. సైనిక కుటుంబాల సంక్షేమంతోపాటు వారి మధ్య సాంస్కృతిక అనుబంధాలను బలోపేతం చేసేలా ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో ఘనంగా జరిగాయి.

## పోలీసుల సహాయంతో వృద్ధుడికి కన్నతల్లి వృద్ధాశ్రమంలో ఆశ్రయం



**వరంగల్, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

ఖిల్లా వరంగల్ కోటలోని పరపతి సంఘం కార్యాలయ పరిసరాల్లో సుమారు 70 ఏళ్ల వయస్సున్న వృద్ధుడు ఒంటరిగా కనిపించడంతో స్థానికులు మిల్స్ కాలనీ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు నవీన్, మహిళా కానిస్టేబుల్ స్వాతి వెంటనే అక్కడికి చేరుకుని వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే వృద్ధుడు ఒకసారి కాజీపేట, మరోసారి నెక్కొండ అంటూ పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో ఆయనకు మతిస్థిమితం సరిగా లేనట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే కన్నతల్లి వృద్ధాశ్రమం చైర్మన్ కొండమీది రాజన్ బాబుకు పోలీసులు సమాచారం అందించారు. అనంతరం వృద్ధుడిని 40వ డివిజన్‌లోని ఉప్పారోని కుంట ప్రాంతంలో ఉన్న కన్నతల్లి వృద్ధాశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కొండమీది రాజన్ బాబు మాట్లాడుతూ, మిల్స్ కాలనీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి ఆదేశాల మేరకు మతిస్థిమితం లేని వృద్ధుడిని ఆశ్రమంలో చేర్చుకుని సంరక్షణ బాధ్యతలు తీసుకున్నామని తెలిపారు. వృద్ధుడికి అవసరమైన ఆహారం, వసతి, వైద్య సహాయం అందిస్తూ సంరక్షిస్తామని పేర్కొన్నారు.

## అభిమానుల ప్రేమకు రష్మిక బహుమతి.. 400 కుటుంబాలకు సాయం



నటి రష్మిక మందన్న మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. ఆపదలో ఉన్న 400 కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. మూడు నెలల పాటు ఆ కుటుంబాల నిత్యావసర సరుకుల ఖర్చును భరించనున్నట్లు ప్రకటించారు. తనలోని ఈ సేవాభావానికి 'రణబాలి' సినిమాలోని జయమ్మ పాత్రే స్ఫూర్తి అని వెల్లడించారు. ఇప్పటివరకు తాను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి బయటకు చెప్పలేదని రష్మిక తెలిపారు. అయితే తనను చూసి మరికొందరైనా సాయం చేసేందుకు ముందుకొస్తారనే ఉద్దేశంతో ఈ విషయాన్ని పంచుకున్నట్లు వివరించారు. ఒక్కోసారి 400 కుటుంబాలకు మూడు నెలల పాటు సాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది పాటు కొనసాగిస్తానని వెల్లడించారు. నిత్యావసర సరకుల కోసం ఖర్చు చేసే డబ్బు ఆదా అయితే, కుటుంబాలు తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవచ్చని రష్మిక ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న సాయం కూడా ఒకరి జీవితంలో మార్పు తీసుకురాగలదని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో సాయం చేయాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమకు వీలైనంతలో చిన్న అడుగుతో ప్రారంభించాలని పిలుపునిచ్చారు. తాను పోషించే పాత్రలు తనపై ప్రభావం చూపుతుంటాయని రష్మిక చెప్పారు. 'రణబాలి'లో జయమ్మ పాత్రకు, తన నిజ జీవిత వ్యక్తిత్వానికి చాలా పోలికలు ఉన్నాయని తెలిపారు. అందులో ఈ సేవాభావం కూడా ఒకటని వివరించారు. అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమకు ప్రతిగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తానని పేర్కొన్నారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. 1876–78 మధ్య మద్రాస్ ప్రాంతాన్ని కుదిపేసిన కరవు నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో విజయ్ దేవరకొండ రణబాలిగా, రష్మిక జయమ్మగా నటిస్తున్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడే యోధుడి కథాంశంతో ఈ సినిమా తెరకెక్కుతోంది.

# 'నో' అని రిప్లై ఇస్తే ఖాతా ఖాళీ!

### ఓటీపీ, లింక్ అవసరం లేకుండానే సైబర్ మోసం.. వాట్సాప్ సందేశాలతో కొత్త పన్నాగం

**హైద్రాబాద్, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**



సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారు. తాజాగా వాట్సాప్ సందేశాలను ఆసరాగా చేసుకుని బ్యాంకు ఖాతాల్లోని నగదును కాజేసే కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. గుర్తుతెలియని నంబర్ నుంచి వచ్చిన సందేశానికి కేవలం 'నో' అని సమాధానం ఇచ్చిన తర్వాత తన బ్యాంకు ఖాతాలోని నగదు మాయమైనట్లు ఓ బాధితుడు పేర్కొన్న ఘటన కలకలం రేపుతోంది. ముందుగా బాధితుడి వాట్సాప్‌కు గుర్తుతెలియని నంబర్ నుంచి 'మీ బ్యాంకు ఖాతా నుంచి ఇంత మొత్తం నగదు డెబిట్ అయింది' అంటూ నకిలీ సందేశం పంపుతారు. అనంతరం 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే వెంటనే నో అని సమాధానం ఇవ్వండి' అంటూ మరో సందేశం పంపి బాధితుడిని భయాందోళనకు గురిచేస్తారు. ఖాతాలో నగదు పోయిందన్న ఆందోళనతో బాధితుడు 'నో' అని సమాధానం ఇచ్చిన తర్వాత సైబర్ దాడికి గురైనట్లు సమాచారం. అయితే, కేవలం 'నో' అని వాట్సాప్‌లో టైప్ చేసి పంపడం వల్లనే సాధారణంగా ఫోన్ హ్యాక్ కావడం సాధ్యం కాదని సైబర్ భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనల్లో హానికరమైన ఫైళ్లు, అనుమానాస్పద లింకులు, మాల్‌వేర్ లేదా ఇతర సాంకేతిక లోపాలను నేరగాళ్లు ఉపయోగించే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. బ్యాంకుల పేర్లు, అధికారుల పేర్లు ఉపయోగిస్తూ నేరగాళ్లు ప్రజల్లో భయాన్ని సృష్టించి తమ వలలోకి లాగుతున్నారని నిపుణులు చెబుతున్నారు. బాధితులు కంగారుపడి స్పందించకుండా ముందుగా తమ బ్యాంకు ఖాతాలో నిజంగా నగదు డెబిట్ అయిందా లేదా అన్నది అధికారిక బ్యాంకు యాప్ లేదా బ్యాంకు అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు.

**గుర్తుతెలియని సందేశాలకు స్పందించొద్దు**

గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే బ్యాంకింగ్ సంబంధిత సందేశాలకు 'అవును', 'కాదు' అంటూ ఎలాంటి సమాధానం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలి. అనుమానాస్పద లింకులు, ఫైళ్లు, దరఖాస్తులు లేదా యాప్‌లను తెరవకూడదు. అనుమానాస్పద నంబర్‌ను వెంటనే నిరోధించి, ఆ సందేశాన్ని తొలగించడం మంచిది. బ్యాంకు లావాదేవీల విషయంలో వాట్సాప్ సందేశాలను మాత్రమే ఆధారంగా చేసుకోకుండా, అధికారిక బ్యాంకు యాప్, అధికారిక వెబ్‌సైట్ లేదా బ్యాంకు అధికారిక కస్టమర్ సేవా కేంద్రం ద్వారా వివరాలను నిర్ధారించుకోవాలి. ఒకవేళ సైబర్ మోసానికి గురై డబ్బు కోల్పోయినట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ నేరాల సహాయవాణికి ఫోన్ చేయాలి. అలాగే సైబర్ నేరాల అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి. వేగంగా ఫిర్యాదు చేయడం ద్వారా నగదును నిలిపివేసే లేదా తిరిగి పొందే అవకాశం పెరుగుతుంది. కంగారులో చేసే ఒక్క తప్పిదం ఆర్థిక నష్టానికి దారితీయవచ్చు. అప్రమత్తతే సైబర్ మోసాలకు తొలి రక్షణ.

# యువత, మహిళలకు పారిశ్రామిక రంగంలో సమాన అవకాశాలు




### తెలంగాణను అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

**హైద్రాబాద్, అక్టోబర్ 14(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రాన్ని అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో యువత, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్--2047లో రూపొందించిన ప్రణాళికలను సద్వినియోగం చేసుకుని యువ పారిశ్రామికవేత్తలు స్టార్టప్‌లు, కొత్త పరిశ్రమలను స్థాపించాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్--2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొత్త తరాన్ని అభివృద్ధి వైపు నడిపించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి, వస్తున్న నూతన విధానాలు, మారుతున్న చట్టాలపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. కేవలం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, నూతన చట్టాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాఖ్యలు, వాణిజ్య మండళ్లు నిర్వహించే సదస్సులు యువతకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, నూతన విధానాలపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఒకే వేదికపై వివిధ రంగాల అనుభవజ్ఞులను కలుసుకుని వారి ఆలోచనలు, అనుభవాల నుంచి నేర్చుకోవడం యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, సినీ రంగాల్లో సాధించిన విజయాలను నమోదు చేసి భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా యువతకు స్ఫూర్తిని కలిగించవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**2047 భారత్‌కు కీలక సంవత్సరం**

భారతదేశానికి 2047 అత్యంత ప్రాధాన్యత కలిగిన సంవత్సరమని సీఎం అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి దేశం సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడంతో పాటు, భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న వికసిత్ భారత్--2047 లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని సూచించారు.

**మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా తెలంగాణ**

తెలంగాణ ప్రభుత్వం 2025లో తెలంగాణ రైజింగ్--2047 గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి రాష్ట్ర అభివృద్ధికి నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించడంతో పాటు తెలంగాణ రైజింగ్ విజన్ పత్రాన్ని విడుదల చేసిందని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా విభజించి, ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా, వనరులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని సుమారు 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 1.34 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్ అర్బన్ రీజియన్‌ను గుర్తించామని తెలిపారు. హైదరాబాద్‌లోని కాలుష్యకారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్ వెలుపల ప్రాంతాలకు తరలించి, నగరంలో సేవా రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాలుష్యకారక పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన రాయితీలు, అనుమతులు, ఇతర సహకారం అందించేందుకు హిల్ట్ విధానాన్ని తీసుకొచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. పరిశ్రమల తరలింపు ప్రక్రియలో పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందన్నారు.

**ఓఆర్ఆర్‌తో హైదరాబాద్‌కు కొత్త రూపు**

హైదరాబాద్ అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ కీలక పాత్ర పోషించిందని సీఎం అన్నారు. మెరుగైన రవాణా అనుసంధానంతో సమాచార సాంకేతిక రంగం, ఔషధ రంగం, విద్య, సేవా రంగాలు విస్తరించి హైదరాబాద్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగిందన్నారు. ఇదే తరహాలో ఔటర్ రింగ్ రోడ్‌కు వెలుపల సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో 360 కిలోమీటర్ల మేర ప్రాంతీయ రింగ్ రోడ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

**యువ పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు**

ఔటర్ రింగ్ రోడ్, ప్రాంతీయ రింగ్ రోడ్ మధ్యనున్న సుమారు 10,500 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీగా గుర్తించి తయారీ పరిశ్రమల ప్రాంతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతం యువ పారిశ్రామికవేత్తలకు స్టార్టప్‌లు, కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు గొప్ప అవకాశాలను అందిస్తుందని చెప్పారు. యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ రింగ్ రోడ్ నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని గ్రామీణ వ్యవసాయ ప్రాంత ఆర్థిక విభాగంగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

**తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలి**

2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కేవలం ప్రణాళికలు రూపొందించడం సరిపోదని, వాటి అమలుకు అవసరమైన కార్యాచరణ, పెట్టుబడులు కూడా అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో సేవలందిస్తున్న భారతీయులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ఇకపై అక్కడ ఉద్యోగులుగా మాత్రమే కాకుండా సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని యువతకు సూచించారు.

**మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం**

ప్రపంచవ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా వేగంగా పురోగమిస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. భారతదేశంలోనూ మహిళల పారిశ్రామిక భాగస్వామ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. యువత, మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా పారిశ్రామిక రంగంలో తెలంగాణ మరింత పురోగతి సాధించగలదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM